ప్రజాశక్తి
ఆదివారం 28 సెప్టెంబర్ 2025 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

సినిమాలకు రాజధాని విజయవాడ

విజయవాడ ఉత్సవ్ ఎగ్జిబిషన్ ప్రారంభంలో బాలకృష్ణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సినిమాలకు రాజధాని విజయవాడ అని, సినీ పరిశ్రమ అభివద్ధికి ఎంతో మంది ఇక్కడ వారు తోడ్పడ్డారని హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ హీరో బాలకష్ణ అన్నారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా విజయవాడ గొల్లపూడిలోని జక్కంపూడి రోడ్డులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం బాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఏపీ బ్రాండ్ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు చాలా ఉన్నాయయని, అందుకే చంద్రబాబు 24 గంటలూ పనిచేస్తున్నారని తెలిపారు. తన అనుభవంతో రాష్ట్రం దేశపటం

(మిగతా 2లో)

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాలకృష్ణ

వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ 2వ పేజీల్లో



శ్రీనివాస్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, చిత్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు; అంతర్ చిత్రంలో శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించిన శ్రీనివాస్

ప్రజాశక్తి గన్నవరం విలేకరికి

పలువురు నేతలు, ప్రముఖుల నివాళి

మళ్లీ వరద ఉధృతి

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : కృష్ణానదికి ప్రకాశం బ్యారేజీకి మరోసారి వరద ఉధ్ధతి పెరిగింది. శనివారం కష్ణానదికి ఎగువ జలాశయాల నుంచి వరద ప్రవాహం పెరిగిన క్రమంలో ప్రకాశం బ్యారేజీ వద్ద మరోసారి వరద ఉధతి పెరిగింది. పులిచింతల నుంచి 3 లక్షల 93 వేల 361 క్యూసెక్కుల వరద ప్రవాహం బ్యారేజీకి చేరుతోంది. దీంతో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 4,323 క్యూసెక్కులు, పశ్చిమ ప్రధాన కాల్వకు 4,523 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం మొత్తం 8,836 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా ప్రకాశం బ్యారేజీ 70 గేట్లలో 69 గేట్లను పైకి ఎత్తి 3 లక్షల 84వేల 525 క్యూసెక్కుల జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ పూర్తి నీటిలో సామర్థ్యం 12 అడుగులు మేర కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు వచ్చే యాత్రికుల భద్రతకు పగడ్బందీ చర్యలు తీసుకున్నట్లు

(మిగతా 2లో)

ట్రాఫిక్ చక్రబంధం

స్తంభించిన ట్రాఫిక్

వార్త 2లో

నేటి అలంకరణ

సినిమాలకు రాజధాని విజయవాడ

(మొదటి పేజీ తరువాయి)

లోనే సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందన్నారు. ఇది ఆధ్యాత్మికం, పర్యాటకం మిళితమైన కార్యక్రమని, దుర్గమ్మ ఆశీస్సులు, కటాక్షం అందరిపై ఉండాలని అన్నారు. 46 రోజులపాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, 11 రోజులు దుర్గమ్మను వివిధ రూపాల్లో అలంకరిస్తారని చెప్పారు. కూచిపూడి, తోలుబొమ్మలు కృష్ణాజిల్లాలో ప్రాచుర్యం పొందాయన్నారు. బసవతారకం హాస్పిటల్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామని గుర్తుచేశారు. అమరావతిలో నిర్మించే హాస్పటల్‌ను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత కష్ణ ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ ముత్తవరపు మురళీకష్ణ, కూటమి నేతలు, బాలకష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మళ్లీ వరద ఉధృతి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ దుర్గాఘాట్, భవానీ ఘాట్, సీతమ్మ వారి పాదాలు తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. భక్తుల భద్రతకు తీసుకోవలసిన అదనపు చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఘాట్లలో రెండంచెల బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేశామని, యాత్రికులు జల్లు స్నానాలు చేసేందుకు అన్ని వసతులతో ఏర్పాట్లు ఉన్నాయని వివరించారు. ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. యాత్రికులు కూడా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది చేస్తున్న సూచనలను పాటించాలని సూచించారు.

ట్రాఫిక్ చక్రబంధం

– విజయవాడ పరిసరాల్లో స్తంభించిన ట్రాఫిక్
– అవస్థలు పడుతున్న యాత్రికులు, నగర వాసులు

ప్రజాశక్తి - విజయవాడ : ట్రాఫిక్ చక్రబంధంలో విజయవాడ నగరం చిక్కుకుంది. పెరిగిపోయిన విపరీతమైన ట్రాఫిక్‌తో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రోడ్లు కూడా ట్రాఫిక్‌తో నిండిపోతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకొని నగర వాసులు, దసరా ఉత్సవాలకు తరలివస్తున్న యాత్రికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా తయారయ్యాయి. దుర్గగుడి పరిసర ప్రాంతాలతోపాటు దుర్గగుడి ఫ్లైఓవర్, కనక దుర్గ వారధి, ప్రకాశం బ్యారేజి, కృష్ణలంక హైవే, బెంజిసర్కిల్, ఎంజి రోడ్డు, కారల్‌మార్క్స్ రోడ్డు, రామవరప్పాడు రింగ్, ఎన్‌హెచ్ 65 జాతీయ రహదారులతోపాటు నగరంలోని అంతర్గత రహదారులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించిపోతున్నాయి. దీంతో గంటల తరబడి యాత్రికులతోపాటు ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకొని తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈనెల 22 నుంచి ప్రారంభమైన దసరా ఉత్సవాలతోపాటు విజయవాడ ఉత్సవ్, విద్యా సంస్థలకు దసరా సెలవులు ఇవ్వడంతో సుదూరు ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులతోపాటు యాత్రికులు, వాహనాల రద్దీతో రహదారులు మొత్తం స్తంభించిపోయాయి. ప్రధానంగా దుర్గగుడి పరిసర ప్రాంతాల రహదారులు, ఫ్లైఓవర్, రాజీవ్‌గాంధీపార్కు, పిఎన్ బస్‌స్టేషన్, కృష్ణలంక పోలీస్టేషన్, అమెరికన్ హాస్పిటల్, వారధి, బెంజిసర్కిల్, రామవరప్పాడు తదితర ప్రాంతాల రహదారులపై గంటల తరబడి వందలాది వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పాదచారులు, వాహనదారులు, యాత్రికులు, ప్రజల ఇక్కట్లు వర్ణనాతీతంగా తయారయింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను కట్టడి చేసే పేరుతో కృష్ణలంక హైవేతోపాటు ఇతర ప్రధాన రహదారులపై ఉన్న అన్ని యు- టర్న్ పాయింట్లను మూసివేస్తుండటంతో వాహనదారులు సుదూరానికి వెళ్లి తిరిగి తన గమ్యస్థానానికి చేరుకోవాల్సి వస్తోంది. దీంతో వాహనదారులు మరింతగా ఇబ్బందులకు గురవుతున్నారు. గంటల తరబడి సమయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. దసరా ఉత్సవాల ట్రాఫిక్ నియంత్రణకు వందలాది మంది పోలీసు సిబ్బందిని కేటాయించినప్పటికీ.. ఆచరణలో మాత్రం ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఒక వైపున

పెరిగిపోతున్న ట్రాఫిక్‌తో ప్రమాదాలు సర్వసాధరణంగా మారాయి. కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ ఫీడర్ రోడ్డులో శనివారం రాత్రి ఓ బైక్‌ను కారు ఢీకొనడంతో బైక్‌ను నడుపుతున్న వ్యక్తి కింద పడి తీవ్రంగా గాయపడిన సంఘటన స్వయంగా ట్రాఫిక్ పోలీసుల సమక్షంలోనే చోటు చేసుకోవడం గమనార్హం. ఇరుకైన రహదారులు, విఫరీతంగా పెరిగిపోతున్న వాహనాలు, కృష్ణలంక లాంటి ప్రధాన రహదారి లాంటి వాటిపై కనీసమైన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి ఐదు నిమిషాలకు పిండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వద్ద నుంచి రాజీవ్‌గాంధీపార్కు, దుర్గగుడి, ఇక్కడున్న ఫ్లైఓవర్‌పై విఫరీతంగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఇప్పటికైనా అటు పోలీసులు, అటు ఆర్అండ్‌బి అధికారులు, ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా ట్రాఫిక్ స్తంభించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మెడికల్ కాలాజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు రౌండ్‌టేబుల్

విజయవాడ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం ఉదయం 11 గంటలకు విజయవాడ రాఘవయ్య పార్క్ సమీపంలోని బాలోత్సవ్ భవన్ రెండో అంతస్తులో రాష్ట్ర స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.విజయ్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఆరోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన జరిగే ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఐఎఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్, శాసన మండలి మాజీ సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, ప్రజా ఆరోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేతలు, ప్రముఖులు, డాక్టర్లు పాల్గొంటారని తెలిపారు.

నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించిన శ్రీనివాస్

ప్రజాశక్తి గన్నవరం విలేకరికి పలువురు నేతలు, ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి - ఉంగుటూరు : ప్రజాశక్తిని ఇంటిపేరుగా, సిపిఎం కార్యాలయాన్ని చిరునామాగా చేసుకున్న నెక్కలపు శ్రీనివాస్ మూడు దశాబ్దాలకుపైగా జర్నలిస్టుగా, సిపిఎం నేతగా నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించారని పలువురు ప్రముఖులు నివాళు లర్పించారు. కృష్ణాజిల్లా గన్నవరం ప్రజాశక్తి విలేకరి నెక్కలపు శ్రీనివాస్ (52) శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. శ్రీనివాస్ ఉదయం 9.50 గంటల సమయంలో బైక్‌పై వికెఆర్ కళాశాల నుంచి బయలుదేరి గన్నవరం వైపు వస్తుండగా హెచ్‌సిఎల్ సమీపంలో వెనుకగా వచ్చిన క్యాబేజీ లోడు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. వెనువెంటనే ఆయనను గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా, అప్పటికే మతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయనకు భార్య ఉన్నారు. శ్రీనివాస్ వికెఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతూ ఎస్ఎఫ్ఐలో చేరి పనిచేశారు. నాడు గన్నవరంలోని సీపీఎం కార్యాలయంలో ఉంటూ రాత్రిళ్ళు అక్కడే చదువుకునేవారు. సుమారు నాలుగేళ్లపాటు ప్రజాశక్తి పేపర్ బోయ్‌గా పనిచేశారు. 1994లో ప్రజాశక్తి విలేకరిగా నియమితులయ్యారు. నాటి నుంచి నేటి వరకు 31 సంవత్సరాలుగా ఆ బాధ్యతను నిబద్ధతగా నిర్వహించారు. సమస్యలను అధ్యయనం చేసి ఎన్నో కథనాలు రాసి జర్నలిస్టుగా మంచి గుర్తింపు పొందారు. సీపీఎం గన్నవరం పట్టణ కార్యదర్శిగా, మండల కమిటీ సభ్యుడిగా, డివిజన్ కమిటీ సభ్యునిగా పని చేశారు. స్థానిక ప్రజలతో సత్సంబంధాలు ఉండటంతో వారి సమస్యల పరిష్కారానికి కూడా నిరంతరం కృషి చేశారు.

పలువురు ప్రముఖులు, నేతలు, ప్రజాశక్తి సిబ్బంది నివాళి

గన్నవరం ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సిపిఎం శ్రేణులు, స్థానికులు, ప్రజాశక్తి సిబ్బంది అక్కడి నుండి శ్రీనివాస్ భౌతిక కాయాన్ని సిపిఎం కార్యాలయం వద్దకు ర్యాలీగా తీసుకొచ్చారు. కొద్దిసేపు ప్రజల సందర్శనార్థం అక్కడ ఉంచారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ఆయన భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాసు, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్లు జి.శివరామకృష్ణ, కె.హరికిషోర్, తోడరమల్లు, ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ప్రజాశక్తి ఉమ్మడి కృష్ణాజిల్లా కన్వీనర్ ఎంబీ నాథన్, సీనియర్ బాధ్యులు సిహెచ్.కృష్ణ ప్రసాద్, డి.ఎస్.ఆర్.వి.ప్రసాద్, ప్రజాశక్తి మాజీ ఉద్యోగి, సీనియర్ జర్నలిస్ట్ యు.రామకృష్ణ, విలేకరి మహేష్, తదితరులు శ్రీనివాస్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు అనుమోలు వెంకటేశ్వరారవు అధ్యక్షతన జరిగిన సంతాప కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... శ్రీనివాస్ మూడు దశాబ్దాలపాటు నిబద్ధతగా ప్రజాశక్తి విలేకరిగానూ, పార్టీ కార్యకర్తగానూ రెండు కర్తవ్యాలను జంటగా నిర్వహించారని నివాళి అర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ విశాఖ పట్నం నుంచి తనకు ఫోన్‌చేసి సంతాపం వ్యక్తం చేశారని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపమని చెప్పారన్నారు. ఎడిటర్ బి.తులసీదాస్ మాట్లాడుతూ... శ్రీనివాస్ మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజాశక్తి శ్రీనివాస్‌గా గుర్తింపు పొంది, దానికి తగినట్లుగానే 31 సంవత్సరాలపాటు మమేకమై పనిచేశారని, మంచి వార్తలు, కథనాలు ఇచ్చి ప్రజల, పాఠకుల ఆదరణ పొందారని కొనియాడారు. వికెఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ కళాశాల పూర్వ విద్యార్థి అయిన శ్రీనివాస్ మంచి స్నేహశీలి అని, విలేకరిగా మంచి వార్తలు రాస్తాడనే గుర్తింపు తెచ్చుకున్నారని నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ.. శ్రీనివాస్ ఇంటిపేరు ప్రజాశక్తిగా, చిరుమానా సిపిఎం కార్యాలయం అన్నంతగా గన్నవరం ప్రాంతంలో గుర్తింపు పొందారని అన్నారు. సీపీఎం కార్యాలయం పరిసర ప్రాంత ప్రజల తలలో నాలుకలా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కషి చేశారని తెలిపారు.

పలువురు ప్రముఖుల నివాళి

శ్రీనివాస్ మృతి వార్త తెలిసిన వెంటనే.. పలువురు ప్రముఖులు, ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు ప్రభుత్వాసుపత్రికీ, సీపీఎం కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకొని నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో గన్నవరం ఎంపీపీ అనగాని రవి, గన్నవరం గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ పొట్లూరి బసవరావు, మాజీ జడ్పీటీసీ ఎం.జయమ్మ, టిడిపి నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, జూపల్లి సురేష్, కంభంపాటి హేమంత్ కోటేశ్వరావు, మాజీ సర్పంచ్ గూడపాటి తులసీ మోహన్, వైసిపి జిల్లా కార్యదర్శి తోట వెంకయ్య, గన్నవరం ఉప సర్పంచ్ నాని, బుల్లితెర నాగభూషణం తదితరులు ఉన్నారు. ఇంకా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి, శివ నాగేంద్రం, సిపిఎం గన్నవరం, ఉంగుటూరు మండలాల కార్యదర్శులు మల్లంపల్లి ఆంజనేయులు, అజ్మీరా వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎమ్‌డి గౌసాని, బీజేపీ రాష్ట్ర

ఆస్పత్రిలో శ్రీనివాస్ భౌతికకాయాన్ని పరిశీలిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్లు జి.శివరామకృష్ణ, హరికిషోర్, తోడరమల్లు తదితరులు

నాయకులు చిగురుపాటి కుమారస్వామి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.ధనశ్రీ, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, గన్నవరం సిఐ శివప్రసాద్, మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బుద్ధవరం పిఎసిఎస్ చైర్మన్ ముద్రబోయిన శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు కాట్రగడ్డ రామచంద్ర జోషి, కొండా వీరాస్వామి, స్పందన మానసిక వికాస కేంద్ర వ్యవస్థాపకులు సంకాబత్తుల వెంకట్, ఇందుపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సీతారాం, మానవత సేవా సంస్థ నిర్వాహకులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, గన్నవరం గ్రామ ప్రజలు, గన్నవరం ఉంగుటూరు, బాపులపాడు మండలాల పాత్రికేయులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీనివాస్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని శ్రీనివాస్ స్వగృహానికి తీసుకెళ్లారు. అక్కడ కొద్దిసేపు ఉంచారు. అనంతరం అక్కడి నుండి నిర్వహించిన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

ప్రజాశక్తి గన్నవరం విలేకరి ఎన్.శ్రీనివాసరావు మృతికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల అధ్యక్షులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, జె.వెంకటప్పయ్య, వై.శ్రీనివాస్ సంతాపం తెలిపారు. శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

CHANGE OF NAME

I, **GOLLPUDI NAGA VENKA RAJYALAKSHMI** (Old Name), W/o. **GOLLAPUDI PANDU RANGADEV**, Resident of Door No: 12-66-2, Ibrahimpatnam, Kondapalli Municipality, NTR District A.P. . I have changed my name as GOLLAPUDI NAGA VENKATA RAJYALAKSHMI (New Name) W/o. **GOLLAPUDI PANDU RANGADEV.** Hereafter my name is known as **GOLLAPUDI NAGA VENKATA RAJYALAKSHMI** (New Name) W/o. **GOLLAPUDI PANDU RANGADEV.**

బహిరంగ వేలం ప్రకటన
మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో
ఐ.ఏ. నెం. 392/2024 ఇన్
ఐ.ఏ.నెం.217/2023 ఇన్ ఓ.యస్.నెం.282/2017
బిట్వీన్ :
పోతర్లంక వెంకట సరోజిని .... పిటిషనర్/వాది
మరియు
ప్రాకర్ల రామకృష్ణ వగైరా ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై నెంబరు ఫైనల్ డిక్రీలో ఈ క్రింద ఉదహరించిన స్థిరాస్తి సమానభాగములుగా పంచుటకు వీలు కానందున సదరు ఆస్తిని వేలం చేసి పంచుటకు శ్రీ కోర్టువారు నిర్ణయించియున్నారు. ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని ది. 15-10-2025వ తేదీ ఉదయం 10.30 ని॥ లకు శ్రీ కోర్టు వారి యెదుట వేలం వేయబడును. ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

స్థిరాస్థి షెడ్యూలు

House and house site an extent of Ac.0.08 cents and house there in bearing Old Door No. 1/23, New Door No. 1/27 of Prakarla Village, Pamarru Mandal, within the Sub-Registry of Pamarru, Krishna District and within the following boundaries:
BOUNDARIES:
EAST: House belongs to Kanakala Pushpavathi
SOUTH: House belongs to Tiripineni Vasudeva Rao
WEST : House belongs to Prakarla Kumara Swamy
NORTH: Private Bazar

ది.15-10-2025వ తేదీన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పై షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని వేలం వేయబడును.
వేలం తేదీ: 15-10-2025
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం//
జి.అప్పయ్య, బి.కాం, బి.ఎల్, అడ్వకేట్,
డోర్ నెం.13/344, పాటిమీద,
గుడివాడ-521 301, కృష్ణాజిల్లా.
సెల్ నెం. 9441120300

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
ఆదివారం 28 సెప్టెంబరు 2025


చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎంఎల్‌ఏ వర్ల

చంద్రబాబును కలిసిన ఎంఎల్‌ఏ వర్ల కుమార్ రాజా

ప్రజాశక్తి-పామర్రు : పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అమరావతిలో అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబునాయుడుని కలిసి పామర్రు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో సమస్యలు, అభివద్ధి పనులకు సంబంధించి విషయాల పై శనివారం వినతి పత్రం అందజేశారు. గ్రామాలలో గల డొంక రోడ్ల నిర్మాణం,ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణం, లంక గ్రామాలలో విద్యుత్ టవర్స్ నిర్మాణం,ముంపు గ్రామాల సమస్యలు, శిథిలావస్థలో ఉన్న వంతెనల నిర్మాణం,పామర్రు లోని డంపింగ్ యార్డ్ తరలింపు కొరకు స్థల స్వేకరణ,రోడ్డుకి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం గురించి వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమస్యలు పరిష్కారం కోసం తగిన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి : మండలి వెంకటకృష్ణారావు వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర నాయకులు, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) జనసైనికుల సంయుక్త ఆధ్వర్య ంలో శనివారం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత సీయోను వీద్ధాశ్రమంలో మండలి బుద్ధప్రసాద్ తనయులు మండలి వెంకట్రామ్ (రాజా) వద్ధాశ్రమంలో వద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం చల్లపల్లిలోని రిక్షా కార్మికులకు రోడ్డు పక్కన నిరాశ్రయులైన వంద మందికి బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మెన్ తోట కనకదుర్గ, రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీటీసీ స్వప్న, కృష్ణా జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు మోర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల పునర్నిర్మాణ పనులకు శనివారం దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌కు చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వర వరప్రసాద్, కష్ణవేణి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. అలాగే యలమంచిలి నాగేశ్వరరావు, స్వర్ణసీత, నందకుమార్ రూ.10,116ను అందించారు. అలాగే పెదగొన్నూరుకు చెందిన బత్తుల నాగేశ్వరరావు స్మారకార్థం మాలతి రూ.10,116ను అందజేశారు. గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నెహ్రూ పశువుల సంత కమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, సభ్యులు పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఈ-పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి భవిష్య త్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ-పంట నమోదు పూర్తి చేయాలన్నారు. ప్రకతి విపత్తులు సంభవించి రైతులు పంటను కోల్పోతే నష్టపరిహారం, పంట బీమా పొందేందుకు, ధాన్యం కొనుగోలు వంటి వాటికి ఈ-పంట నమోదు తప్పని సరి అయిన నేప థ్యంలో ఆలస్యం చేయకుండా గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, తల్లికి వందనం పథకాల కింద నగదు జమ కాని లబ్ధిదారుల సాంకేతిక సమస్యలను పరిష్కరించాలన్నారు. బ్యాంక్ ఖాతాను తెరవటం, బ్యాంక్ అకౌంట్ కు ఆధార్ నంబర్ అనుసంధానం చేయడంపై లబ్ధిదారులకు వివరించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ వైద్యుల నిరసనలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల నిరసనలు రెండవ రోజుకు చేరాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఆందోళనలో భాగంగా వైద్యులు శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులకు హాజరైనప్పటికీ, రోజువారీ వైద్య సేవలు, సంచార చికిత్స శిబిరాలను మాత్రం బహిష్కరించినట్లు వైద్యుల సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి. దివ్య మాట్లాడుతూ, దశలవారీగా ఈ పోరాటాన్ని కొనసాగిస్తు న్నామని, దీనిపై ఉన్నతాధికారులకు వినతిపత్రాల ద్వారా ఇప్పటికే సమాచారం అందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘం పిలుపు మేరకు కొనసాగుతున్న ఈ నిరసనలో భాగంగా సెప్టెంబర్ 28న అధికారిక వాట్సాప్ గ్రూప్‌లను బహిష్కరించనున్నట్లు వెల్లడించారు. 29న అన్ని పీహెచ్సీలలో ఓపీ సేవలు నిలిపివే యనున్నట్లు, 30న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, ప్రదర్శనలు జరగనున్నాయని చెప్పారు. అక్టోబర్ 3 నుంచి విజయవాడలో రాష్ట్రస్థాయి నిరసన కార్యక్రమాలు, వైద్యాధికారుల నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభమవుతాయని వివరించారు.వైద్యులు తమ డిమాండ్లలో భాగంగా జి ఓ 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ, సమయానికి ప్రమోషన్లు, ట్రైబల్ అలవెన్సు, 104 సంచార చికిత్స అలవెన్సు, నోషనల్ ఇన్క్రిమెంట్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

న్యాయమూర్తికి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి వి గోపాలకష్ణరావు దంపతులు దర్శించు కున్నారు. దేవస్థానానికి వచ్చిన గోపాలకష్ణరావు దంపతులకు ఆలయ సూపర్నెండెంట్ బొప్పన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు బుద్ధు పవన్ కుమార్ శర్మ అర్చకత్వంలో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా గోపాలకష్ణరావు ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారు శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ పండితులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపాలకష్ణారావు దంపతులను బొప్పన సత్యనారాయణ ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి కేత అరుణ, ప్రోటోకాల్ జడ్జి వాల్గామార్క స్వర్ణలత, తహసిల్దార్ హరిహరనాథ్, చల్లపల్లి సిఐ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పురిటిగడ్డలో 'పొలంబడి'

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని పురిటిగడ్డలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె. మురళీకృష్ణ వరి పంటలో చీడపీడల యాజమాన్యంపై, నూతన సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అవసరం మేరకే ఎరువులు పురుగు మందులు వాడటం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి నాణ్యమైన దిగుబడులు వస్తాయని వివరి ంచారు. ఈ నెలాఖరు లోపు ఈ క్రాప్ బుకింగ్ తప్పని సరిగా రైతులు చేయించుకోవాలని సూచించారు. రైతు లు మాజీ సర్పంచ్ పర్చూరు సురేష్ బాబు, వ్యవసాయ సహాయకులు నాగబాబు, సత్యదేవ్, రేవతి పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ఉయ్యూరు : రైతులు పండించిన పంట రైతు సహాయక కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేయిం చుకోవాలని ఉయ్యూరు ఆర్డీఓ బి. హేలాషారోన్ అన్నారు. ఉయ్యూరు పరిధిలో జరుగు తున్న పంట నమోదు ప్రక్రియను గన్నవరం ఏడీఏ సునీల్ తో కలసి శనివారం పరిశీలి ంచారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ పంటనమోదు ప్రక్రియ ఈనెల 30 తో ముగుస్తుందని, రైతులు తప్పనిసరిగా తాము పండించిన పంట రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేయించుకుని మండల, గ్రామస్థాయి అధికారులతో సహకరించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : రైతుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించు కోవాలని ఉయ్యూరు ఆర్‌టిఒ షారోను అన్నారు. శనివారం పమిడిముక్కల మండలంలోని తాడంకి గ్రామంలో ఆమె అధికారులతో ఈ క్రాప్ ను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డుతో రైతు ఈ క్రాప్ చేయించు కోవాలని తెలిపారు. మండలంలోని లంకపల్లి, కృష్ణాపురం, కపిలేశ్వరపురం గ్రామాల్లో ఈ క్రాప్ త్వరగా పూర్తి చేయా లని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ నవీన్ కుమార్ ,రెవిన్యూ సిబ్బంది వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పమిడిముక్కల మండలంలో ఈక్రాప్ పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : పొట్టిపాడు గ్రామ శివారున నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతిచెందాడు. ఏలూరు వైపు బైక్ పై వెళ్తున్న యువకుడ్ని అదే దిశలో వెనుక నుండి వ్యాన్ గుద్దడంతో అక్కడిక్కడే మతిచెందారు. మతుడు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన సావలి శివప్రసాద్ (36)గా గుర్తింపు. మతుడు జనసేన పార్టీ కార్యకర్తగా ఉంటూ, ప్రస్తుతం జనసేన పార్టీ ఆఫీసులో సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా పనిచేస్తున్నాడు. ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - పెదపారుపూడి(గుడివాడ) : రాష్ట్ర న్యాయసేవ సంస్థ వారి ఉత్తర్వులు మేరకు గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం శనివారం పెదపారుపూడి తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన రాష్ట్ర న్యాయసేవ సంస్థ వారు ప్రవేశపెట్టిన జాగతి పథకం కింద పేదలకు అందుతున్న ఉచిత సహాయాలు, అలాగే వారికి అందుతున్న న్యాయ సలహాలు గురించి ఆరాతీశారు. అనంతరం రెవెన్యూ సేవలు ప్రజలకు సకాలములో అందుతున్నాయో లేవో అని రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు కొడాలి ఏసుపాదం, ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కోడూరు : మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణా రావు 28 వ వర్ధంతి సందర్భంగా కోడూరు మండల జనసేన పార్టీ నాయ కులు ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత కోడూరు ప్రధాన సెంటర్లోని కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఉచితంగా పశువుల మందులు పంపిణీ చేశారు.అలాగే జనసేన పార్టీ కోడూరు మండలం నాయకుల ఆధ్వర్యంలో యువనేత మండలి వెంకట్రామ్ చేతుల మీదగా పేదలకు నూతన వస్త్ర పంపిణీ చేశారు. ఈకార్య క్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం, ముక్కోల్లు గ్రామంలో ఇటీవల పెద్ది సొల్మన్ బాబు అనే బాలుడు చెరువులో పడి మతి చెందగా వారి కుటుంబ సభ్యులకు ముక్కొల్లు కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు సమ్మెట రాఘవ ప్రసాద్ తన వంతు సాయంగా శనివారం 5000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాట్రేడ్డి నాగ మురళి, సమ్మెట తులసిరావు, సమ్మెట నాగభూషణం (నాని) సమ్మెట తులసి బాబు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ
వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సూర్యారావు పేటలోని డాక్టర్ ఎన్ సుబ్బారావు సెంటర్ ఫర్ కార్డియాక్ సెంటర్‌లో ఈ నెల 28వ తేదీ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ మురళి కృష్ణ తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఈసిజీ, 2డి ఎకో, ఆర్‌బిఎస్, హెచ్‌బిఎ1సి, లిపిడ్ ప్రొఫైల్, ఉచిత కన్సల్టేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సిమెంటు దిమ్మలు తొలగించాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 50వ డివిజన్‌లోని గొల్లపాలెం గట్టు అరుణ కాన్వెంట్ ఎదురుగా కల్వర్ట్ రిపేర్లు కోసం తవ్వి వదిలేసిన మట్టి కుప్పలు, సిమెంట్ దిమ్మలు తొలగించి ప్రజలు రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బి.సత్య బాబుకు నగరపాలక సంస్థ అధికారులను డిమాండ్ చేశారు . డివిజన్ పరిధిలోని కస్తూర్బా ఆశ్రమ ఎదురు రోడ్డుకు గుంతలు ఏర్పడి మురుగు కాల్వ ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. దెబ్బతిన్న కల్వర్టుతోపాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. 170 సచివాలయం పరిధిలోని ఇళ్లల్లోకి మున్సిపల్ వాటర్ కలుషితమై, రంగు మారి దుర్వాసనతో వస్తుందని, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకొని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మహేష్ , దుర్గారావు , తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ కార్డ్‌తో ఇండిగో భాగస్వామ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద ప్యూర్-ప్లే క్రెడిట్ కార్డ్ జారీదారు ఎస్‌బిఐ కార్డ్, ప్రముఖ ఎయిర్ లైన్ ఇండిగో కలిసి ఇండిగో బ్లూచిప్ లాయల్టీ ప్రోగ్రాంలో భాగంగా 'ఇండిగో ఎస్‌బిఐ కార్డ్'ను ప్రారంభించిందని సంస్థ ప్రతినిధి ఎం.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రయాణీకులకు అత్యధిక రివార్డింగ్ అనుభవాన్ని అందించుటకు ఈ ప్రీమియం కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్, ఇండిగో ఎస్‌బిఐ కార్డ్, ఇండిగో ఎస్‌బిఐ కార్డ్ ఎలైట్ అనే రెండు రకాలలో ప్రవేశపెట్టబడిందని తెలిపారు. వినియోగదారులు ఇండిగో ఎకో వ్యవస్థలో ఆఫరింగ్స్‌పై, హెూటల్, ప్రయాణ బుకింగ్స్‌పై చేసిన ఖర్చులపై రివార్డులు సంపాదించుకోవచ్చన్నారు. ఈ కార్డ్ కోసం ఎస్‌బిఐ కార్డ్ వెబ్సైట్ ఎస్‌బిఐ కార్డ్ డాట్ కామ్ సందర్శించి ఎస్‌బిఐ కార్డ్ స్ప్రింట్ ద్వారా డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎస్‌బిఐ కార్డ్ రీటెయిల్ కియోస్కలను సందర్శించడం ద్వారా ఆఫ్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఫ్లిప్‌కార్ట్‌లో ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక అమ్మకాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, తమ వార్షిక షాపింగ్ ఫెస్టివల్, ది బిగ్ బిలియన్ డేస్ కోసం సిద్ధమవుతున్న వేళ, పెట్రోల్, ఎలక్ట్రిక్ వాహనాలలో విస్తృత ఎంపిక అవకాశాలను అందించటం ద్వారా ద్విచక్ర వాహనాల కోసం షాపింగ్ చేసే విధానాన్ని మార్చడానికి సిద్ధంగా ఉందని ఫ్లిప్‌కార్ట్ ఎలక్ట్రానిక్స్ విభాగ ప్రతినిధి సుజిత్ అగాషే తెలిపారు. నగరంలోని ఫ్లిప్ కార్డ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. పండుగ సీజన్ ప్రారంభం కావడంతో, వైవిధ్యం, స్థోమత, నమ్మకం, 24 గంటలూ కస్టమర్ మద్దతు కలయికను అందించడం ద్వారా ద్విచక్ర వాహనాలకు ఇష్టమైన గమ్యస్థానంగా తన స్థానాన్ని ఫ్లిప్‌కార్ట్ బలోపేతం చేస్తోందన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం

మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

మాట్లాడుతున్న మంత్రి బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-విజయవాడ : గురుకులాల్లో చదివే ప్రతి ఎంపిసి విద్యార్థి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్... ప్రతి బైపిసి విద్యార్థి ఎంబిబిఎస్ గ్రాడ్యుయేట్ అయ్యేలా వారిని తీర్చిదిద్దాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో అంబేద్కర్ గురుకులాల ఐఐటి, నీట్, ఎక్సలెన్సీ సెంటర్ల సిబ్బందికి శిక్షణ తరగతులను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల విద్యార్థులకు ఉచిత ఐఐటీ, నీట్ కోచింగ్‌కు నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థల సహకారం మరువలేనిదన్నారు. పేద పిల్లలు మట్టిలో మాణిక్యాలని, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. సిబ్బంది నిరంతరం విద్యార్థులకు అర్థమయ్యేలా తరగతులు బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్‌డబ్ల్యుఆర్‌ఇఎల్‌ఎస్ సెక్రటరీ వి.ప్రసన్న వెంకటేష్, అడిషనల్ సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్రీడా వర్గీకరణ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. ప్రస్తుతం జీఓ 4 ప్రకారం క్రీడలు, ఆటలను రెండుగా వర్గీకరించినట్లు తెలిపారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్‌తో కలిసి శాప్ చైర్మన్ రవి నాయుడు శనివారం ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలలో పలు జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆసియా ఛాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్ కాంస్య పతక విజేత ఎన్ అనూష, జూనియర్ నేషనల్స్ బంగారు పతక విజేత ఆరోన్‌లను అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ ఎస్.సంతోష్ కుమార్, టోర్నమెంట్ పరిశీలకుడు కె.జగదీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.శేఖర్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.దిలీప్ ప్రసన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి టీచర్ల వింగ్ జిల్లా అధ్యక్షునిగా ఆంజనేయ రెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : వైసిపి టీచర్ల విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షునిగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు వెలువరించింది. టీచర్ల విభాగం అధ్యక్షునిగా తనను నియమించటంలో కృషి చేసిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌రావు తోపాటు పార్టీ అగ్రనేతలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆంజనేయరెడ్డి పత్రికా శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తానంటూ ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

హస్త కళాకారుల వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దేశ సంస్కృతిలో భాగమైన హస్త కళలు కనుమరుగవ్వకుండా కాపాడుకోవాలని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక బెరంపార్కులో శనివారం జరిగిన హస్త కళాకారుల ఒకరోజు వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్న మతాలు, జాతులు, తెగలు, సంస్కృతుల మధ్య దేశంలో కొనసాగుతోన్న ఏకత్వాన్ని హస్తకళారూపాలు, నాట్య, సంగీత, సాహిత్యాలు దోహదపడతాయని తెలిపారు. మన హస్త కళాకృతులు అమెజాన్ వంటి సంస్థల సహకారంతో దేశ, విదేశాల్లో ప్రఖ్యాతమవ్వాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎం.ఆదినారాయణ, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ సీనియర్ కన్సల్టెంట్ పి.సుధీర్ కుమార్, సి.ఆర్. మీడియా అకాడ మేనేజర్ ఎం.భాస్కర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగాసన స్పోర్ట్స్ ఛాంప్

గోడపత్రికను విడుదల చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడలోని పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు 6వ జాతీయ జూనియర్ (14 నుంచి 18 సంవత్సరాల్లోపు), సీనియర్-సి (45 నుంచి 55 సంవత్సరాల్లోపు) యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ నిర్వహిస్తామని రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. పిబి సిద్ధార్థ కళాశాల ఇండోర్ స్టేడియంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం సౌజన్యంతో జరుగుతున్న ఈ పోటీల్లో దేశంలోని 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 618 మంది క్రీడాకారులు, వంద మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారన్నారు. పోటీల సంచాలకుడు అభిజిత్ బోస్ మాట్లాడుతూ జూనియర్స్ బాలబాలికల విభాగంలో ట్రెడిషనల్ వ్యక్తిగత, గ్రూపు, ట్రెడిషనల్ స్పెసిఫికేషన్, ఆర్టిస్టిక్, సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, బృందం, రిథమిక్ పెయిర్ ఈవెంట్లతో పాటు సీనియర్-సి'లో ట్రెడిషినల్ వ్యక్తిగత, స్పెసిఫికేషన్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల నుంచి అంతర్జాతీయ యోగాసన పోటీల్లో పాల్గొనే భారత జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక, యోగాసన భారత్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ శ్రేయస్ మార్కండేయ, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు కె.రామకష్ణ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు డి.దుర్గారావు, ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు కొంగర సాయి, తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-విజయవాడ :నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యాటల్లో భాగంగా బందర్ రోడ్డుబందర్ రోడ్డు, వెటర్నిటీ హాస్పిటల్, బెంజ్ సర్కిల్, నిర్మల కాన్వెంట్ జంక్షన్, రమేష్ హాస్పిటల్ జంక్షన్, ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వాహణలో ఎటువంటి లోపం ఉండరాదని, ప్రతిరోజు రోడ్డులు పరిశుభ్రంగా ఉంచాలని, నగర పరిశుభ్రతలో ఎటువంటి లోపం ఉండరాదని, రోడ్డులో డివైడర్ల వద్ద కూడా శుభ్రంగా ఊడ్చాలని, ప్రతిరోజు ఇంటి వద్దనే వ్యర్థాలను సేకరించాలని, రోడ్డుపైన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కృష్ణలంకలోని శ్రీ కాళీమాత దేవస్థానంలో శ్రీ నవదుర్గా నాట్య ధర్మిక సంస్థ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు చాలా చక్కగా ఉన్నాయని సీనియర్ రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ అభినందించారు. శనివారం దసరా ఉత్సవాల సందర్భంగా కృష్ణలంక త్రిశక్తి పీఠాన్ని సందర్శించి మహాలక్ష్మి, కాళీకాదేవి మహా సరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. కాళీమాత ఆలయంలో శ్రీ నవదుర్గా నాట్య ధార్మిక ఏర్పాటు చేసిన నృత్య కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నవదుర్గా నాట్య ధర్మిక సంస్థ నాట్యాచార్యులు ఎస్.కె విశ్వనాథ శాస్త్రి, ఎస్ సుధారాణి, దుర్గా బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ అల్లంపూర్ణ చంద్ర రావు పాల్గొన్నారు.

శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దసరా ఉత్సవాల సందర్భంగా చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శనివారం శ్రీ లలితా త్రిపరసుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ఆరవ రోజున తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్ టైల్స్ స్పెషల్ సెక్రటరీ శిశోడియా, సెక్రటేరియట్ సిఎం ప్రోటోకాల్ రామసుబ్బయ్య, సెక్రటేరియట్ ఎండోమెంట్స్ సూపరింటెండెంట్ ఎం.సుధాకర్, రాజమండ్రి జాయింట్ కలెక్టర్ చిన్నరాయుడు, గౌతమ్ స్కూల్స్ అధినేత నల్లాన సూర్యారావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళాశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 29న మూలా నక్షత్రం, శ్రీ సరస్వతి దేవి అలంకారం దృష్ట్యా భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి వస్తారని, దానికి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేశామని వివరించారు. దేవస్థానం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), పాల్గొన్నారు.

పోటెత్తిన సందర్శకులు

- మూలానక్షత్రం నాడు సిఎం పర్యటనపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ సిటీ, విజయవాడ, అర్బన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు శనివారం సందర్శకులు పోటెత్తారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు దసరా మహోత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. ఆధునిక డ్రోన్, సిసి కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తూ ఆయా శాఖల సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఈ 29వ తేదీన మూలనక్షత్రంనాడు ఆనవాయితీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈనేపథ్యంలో శనివారం మోడల్ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఆలయ ఇఒ, ఇతర ఉన్నత్తాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిపిలు కె.జి.వి.సరిత, కె.శ్రీనివాసరావు, ఆనంద రెడ్డి, ఎస్.వి.డి.ప్రసాద్, ఎడిసిపిలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు, సారె సమర్పణ

దసరా నవరాత్రులలో ఆరవ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారికి విశాఖపట్నంలో కొలువై ఉన్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం తరపున దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కె.శోభారాణి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు.

అర్చక సభ

దసరా నవరాత్రులలో ఆరవరోజైన శనివారం అర్చక సభ జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రధాన దేవాలయాల నుంచి సుమారు వంద మంది అర్చకులు ఈ సభలో పాల్గొన్నారు. 2009 నుంచి ఇంద్రకీలాద్రిలో అర్చక సభ నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఉప ప్రధాన అర్చకులు కోట రవికుమార్ తెలిపారు. నాటి దేవాదాయ శాఖ కార్యదర్శి కెవి రమణ చారి, స్థానాచార్యులు శివప్రసాద్, ఆగమ సలహాదారు మద్దూరి యాజుల సహకారంతో ఈ అర్చక సభ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం స్థానాచార్యులు కెఈఎస్ సాయి, దుర్గగుడి నూతన చైర్మన్ బొర్రా రాధాకష్ణ, దుర్గగుడి స్థానాచార్యులు శివ ప్రసాద్, ప్రధాన అర్చకులు ఎల్.దుర్గా ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు వై.నాగరాజు శాస్త్రి, ఎంవి రామమూర్తి, వెంపటి శ్రీధర్ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న బాలకృష్ణ

శ్రీ లలిత త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను హిందూపురం శాసనసభ్యులు, ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకష్ణ తదితరులు దర్శించుకున్నారు.

సింగర్ సునీత

నెట్టెం రఘురాం

సందడిగా పున్నమి ఘాట్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ, విజయవాడ, అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ ఆరో రోజు శనివారం రాత్రి పున్నమి ఘాట్ సందడిగా మారింది. కష్ణా తీరం వద్ద జరిగిన ఈ సాంస్కతిక విందు ఆధ్యాత్మికత, కళ, వినోదం ప్రేక్షకులను అలరించింది. నలందా టీమ్ మహిళా బందం ప్రదర్శించిన 'అయిగిరి నందిని' నత్యం వేదికను మంత్రముగ్ధం చేసింది. శక్తి స్వరూపిణి మహాదేవి వైభవాన్ని ప్రతిబింబిస్తూ ఆ బందం సమన్వయంతో చేసిన ఆరాధనాత్మక నత్యం ఆకట్టుకుంది. కష్ణా తీరం మీద ఆకాశాన్ని వెలుగులతో అలరించిన డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగురంగుల కాంతులతో జాతీయ చిహ్నాలు, సాంప్రదాయ ప్రతీకలు, సాంస్కతిక రూపాలను ఆకాశంలో సష్టించిన ఈ ప్రదర్శనను చూసి ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. స్థానిక కళాకారులు ప్రదర్శించిన గరగల నత్యం సాంప్రదాయ కాంతిని చాటింది. తాళం, లయ, శక్తి సమన్వయంతో సాగిన ఈ నత్యం ఘాట్ వద్ద అందరినీ ఉర్రూతలూగించింది. ఈ క్రమంలో ప్రముఖ గాయని సమీరా భరద్వాజ్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఘాట్ సందడిని మరింత పెంచింది. ఆమె అద్భుతమైన గాత్రంతో భక్తి, సినీ పాటలు పాడగా ప్రేక్షకులు ఉత్సాహంగా ఆలకించి చప్పట్లతో అభినందించారు.

కళాకారులకు సన్మానం

నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంస్కతిక ప్రదర్శనలు కన్నులపండువగా సాగాయి. ఈ వేడుకలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఏపీ రాష్ట్ర సజనాత్మకత, సాంస్కతిక కమిషన్ చైర్మన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటకరంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంస్కతిక కార్యక్రమాలలో అద్భుత ప్రదర్శనలు అందించిన పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు.

అలరించిన శ్రీ కష్ణా తులాభారం

విజయవాడ ఉత్సవ్ భాగంగా నగరంలోని ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో తెనాలికి చెందిన శ్రీ వెంకట లక్ష్మీ దుర్గ నాట్యమండలి వారు శ్రీ కష్ణా తులాభారం ప్రదర్శించారు. శ్రీ కష్ణుడి పాత్రగా ఏ కోటేశ్వరరావు, నారదుడు గా కె.గణేష్ కుమార్, సత్యభామ గా కె.వనజ కుమారి, రుక్మిణిగా జయమాధురి, వసంతకుడి గా ఎస్.రాంబాబు, నళిని గా పద్మ లు అద్భుత ప్రదర్శన చేశారు. అలాగే కాకినాడకు చెందిన అనపర్తి సుబ్బారావు, రాజుల బందంచే ప్రదర్శించిన తోలుబొమ్మలాట ప్రాచీన కళలను కళ్ళకు కట్టినట్లు కనిపించింది.

ఎగ్జిబిషన్ ప్రాంతాన్ని పరిశీలించిన సిపి

పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఇతర అధికారులతో కలిసి శనివారం గొల్లపూడి ఎక్సిభిషన్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బంధోబస్త్ ఏర్పాట్లను పూర్తిగా పరిశీలించారు.

'శ్రీవాహిని'లో బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజినీరింగ్ కాలేజీలో బతుకమ్మ వేడుకలు సందడిగా జరిగాయి. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మను అలంకరించి పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ సాంప్రదాయాన్ని ప్రతిబింబించారు. విద్యార్థులు ఉత్సాహంగా కొలాటం ఆడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, ఏఓ ముత్యాల కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు భారతీయ సంప్రదాయాలను, సంస్కృతిని తెలుసుకోవడం చాలా అవసరమని, ఇలాంటి వేడుకలు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు.

భార్యాభర్తలపై దాడి

ప్రజాశక్తి-వీరులపాడు : తన కుమారుని అకారణంగా కొట్టిన వ్యక్తిని ఇదేమని అడగటానికి వెళ్లిన భార్యాభర్తలపై విచక్షణారహితంగా ఒక వ్యక్తి దాడి చేసిన సంఘటన గూడెం మాధవరం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఎన్టీఆర్ జిల్లా వీరులుపాడు మండలం గూడెం మాధవరం గ్రామానికి చెందిన అన్న బత్తిన నాగమణి అంగన్‌వాడి ఆయాగా పని చేస్తున్నారు. నాగమణి ఇంటికి సమీపంలో గద్దె ఓంకార్‌కు ఐదు పాడి గేదలు ఉన్నాయి. వాటి వ్యర్థాలను నాగమణి ఇంటి సమీపంలో పడేస్తుండడంతో ఇరు కుటుంబాలకు మధ్య చిన్నపాటి ఘర్షణలు జరిగాయి. దసరా పండుగ పురస్కరించుకొని శుక్రవారం రాత్రి నాగమణి కుమారుడు జగదీష్ బతకమ్మల ఆటల వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన ఓంకార్ మరి కొందరితో కలిసి జగదీష్‌పై వీక్షణారహితంగా దాడి చేశారు. విషయం తెలుసుకున్న నాగమణి, ఆమె భర్త కోటేశ్వరరావు కలిసి ఓంకారును అడిగేందుకు వెళ్లగా వారిపైనా దాడి చేశారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడికి సిఐటియు ఖండన

గూడెం మాధవరం గ్రామంలో అంగన్‌వాడి ఆయా నాగమణిపై దాడిని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మేరీ, పుల్లమ్మ ఖండించారు. దాడికి పాల్పడిన ఓంకారపై పోలీసుల చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి- ఇబ్రహీంపట్నం: కాకినాడలోని డిఎస్‌ఏ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర విద్యుత్ సంస్థ ఉద్యోగుల టేబుల్ టెన్నిస్, హాకీ పోటీలు శనివారంతో ముగిశాయి. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో మొదటి స్థానంలో ఎన్‌టిటిపి ఎస్‌డివైఈఈ ఆదినారాయణ, రెండవ స్థానంలో డివైఈఈఎస్‌డిఎస్ టిపిఎస్ భూపతి, మూడవ స్థానంలో డివైఈఈఎల్ హెచ్‌ఈఎస్ లక్ష్మణ్ రావ్ నిలిచారు. టేబుల్ టెన్నిస్ ఓపెన్ డబుల్స్‌లో మొదటి స్థానంలో లక్ష్మణ రావ్, కష్ణ కుమార్ (ఎల్ ఎస్ హెచ్ ఈ ఎస్), రెండవ స్థానంలో సుదీర్, మహేష్ (గుంటూరు), మూడవ స్థానంలో భూపతి, లక్ష్మీనారాయణ (ఎస్‌డిఎస్‌టిపిఎస్) నిలిచారు. టేబుల్ టెన్నిస్ టీం విభాగంలో మొదటి స్థానంలో ఎన్‌టిటిపిఎస్, రెండవ స్థానంలో గుంటూరు సర్కిల్, మూడవ స్థానంలో దిగువ సిలేరు నిలిచాయి. హాకీలో మొదటి స్థానంలో కడప సర్కిల్, రెండవ స్థానంలో తిరుపతి సర్కిల్, మూడవ స్థానంలో నెల్లూరు సర్కిల్ నిలిచాయి. యన్.టి.టి.పి. యస్. చీఫ్ ఇంజనీర్, ఓ అండ్ యమ్, పి. శివ రామాంజనేయులు అభినందనలు తెలిపారు.

బీమా పథకాలను వినియోగించుకోవాలి



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాయనపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎఫ్ ఎస్ డైరెక్టర్ జనరల్ చంద్రదీప్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్బిఐ విజయవాడ శ్రీతాక్షి సింగ్, విజయవాడ రీజినల్ మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డ్ డిజిఎం రాజ్ కుమార్ శర్మ, సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇ రచన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను ప్రజలందరూ వినియోగించుకునేలా చూడాలి. ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతా సక్రమంగా నిర్వహించడానికి తప్పనిసరిగా ఈకేవైసీ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ఎవరైనా సైబర్ క్రైమ్‌కు గురైనట్లు భావిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1930ను వెంటనే సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఎఫ్ఐ ఏజీఎం డి భద్ర నారాయణ, ఎస్ఎల్‌బిసి ఏజీఎం పిటి వెంకటరావు, ఎన్టీఆర్ జిల్లా సిడిఎం కే ప్రియాంక, రాయనపాడు బ్రాంచ్ మేనేజర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ శంకర్ నాయక్‌కు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ-2గా బాధ్యతలు స్వీకరించిన భూక్యా శంకర్ నాయక్‌ను శనివారం జగ్గయ్యపేట నియోజకవర్గ బంజారా ఉద్యోగులు, నాయకులు జగ్గయ్యపేట స్టేషన్లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేటమండల ఎంఈఓ ఎల్ చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయులు ఆర్ రాంబాబు నాయక్, శివరాం నాయక్, ఉపాధ్యాయులు పాండు నాయక్, శ్రీనివాసరావు, లాహెూరీ కుసుమ లతా బాయి, హుస్సేన్ నాయక్, జిల్లా గిరిజన సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

టిడిపి సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి తిరువూరు : విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) సారధ్యంలో విజయవాడలో జరుగుతున్న "విజయవాడ ఉత్సవ్ - 2025" ను ప్రతిబింబిస్తూ తెలుగుదేశం పార్టీ తిరువూరు పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద నుంచి బోస్ బొమ్మ సెంటర్ మీదుగా జై బావి సెంటర్ వరకు డప్పు కళాకారులు, విద్యార్థులు, పార్టీ శ్రేణులు పలు రకాల పాటలు, కోలాట నత్యాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు జరుపుకున్నారు. విజయవాడ ఉత్సవ్‌ను తలపిస్తూ డాన్సులు, కేరింతలతో యువత సందడి చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు దుబ్బాక వెంకటేశ్వర్లు, మల్లెల శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు నాళ్ళ సురేంద్ర, షేక్ అబ్దుల్ హుస్సేన్, మూడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించాలంటూ నిరసన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు నిరసన తెలిపారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట మోడల్ కాలనీలో శనివారం కాలనీవాసులు సిపిఎం సీనియర్ నాయకులు కోట కృష్ణ ఆధ్వర్యంలో కాలనీలోని కొన్ని వీధులలో డ్రైనేజీలు నిర్మించకపోవడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వర్షం వచ్చిందంటే రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు నిలిచిపోతుందని, దీంతో ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారి ప్రయాణించడానికి వీల్లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి మోడల్ కాలనీలో డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఇటుకుల గోపాలరావు, నాగయ్య, తిరుపతిరావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా 'విజయ నర్తనం'

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో విజయ నర్తనం కొండపల్లి ఉత్సవ్‌లో భాగంగా ఆరవ రోజు ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. సుభద్ర బృందంచే కోలాటం, కలక్షేత్ర డాన్స్ అకాడమీ జానపద నృత్యం, అనురాధ శిష్య బృందంచే కూచిపూడి జానపదం నృత్యాలు, మంజుల పద్మజా హైదరాబాద్ వారిచే కూచిపూడి జానపద నృత్యాలు, పద్మప్రియ వరంగల్ వారిచే కూచిపూడి జానపదం నత్యాలు జరిగాయి.

చావు బతుకుల్లో యువతి
దాతల సాయం కోసం వేడుకోలు

ప్రజాశక్తి - తిరువూరు : తీవ్రమైన ఆరోగ్య సమస్యతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఒక యువతి దాతల సాయం కోసం వేడుకుంటోంది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణం మధిర రోడ్డుకు చెందిన కొత్తపల్లి నిర్మల ఒక స్వచ్ఛంద సేవా సంస్థలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఇటీవల అనారోగ్యానికి గురైన నిర్మల విజయవాడ, హైదరాబాద్ ఆస్పత్రులలో చికిత్స పొందుతోంది. ఆమె బైల్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. కడుపులో ఉండాల్సిన బైల్ జ్యూస్ బయటకు రావడంతో వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. ఆపరేషన్‌కు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన నిర్మలకు వైద్యానికయ్యే ఖర్చు భారంగా మారడంతో దాతల సాయం కోరుతోంది. ఆర్థిక సహాయం చేయదలచినవారు 9848571226 నెంబర్ గల గూగుల్, ఫోన్ పేకు చేయవలసిందిగా కోరారు.

మున్నేరు తగ్గుముఖం

ప్రజాశక్తి వత్సవాయి : రెండు రోజులుగా మున్నేరు వరద ఉధృతి పెరగడంతో భయాందోళనకు గురైన ప్రజల్లో ఊరట నెలకొంది. ఎగువ ప్రాంతాల నుంచి నీటి ఉధృతి తగ్గడంతో లింగాల మున్నేరు తగ్గుముఖం పట్టింది. లింగాల బ్రిడ్జి వద్ద నాలుగు అడుగులకు దిగువుగా వరద ప్రవహిస్తుంది. ఈ సంవత్సరం లింగాల బ్రిడ్జిపైకి ప్రవహించే పరిస్థితి లేదని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి- జగ్గయ్యపేట: విజయవాడ నగరంలో స్వర హాస్పిటల్‌లో జగ్గయ్యపేట మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన కంబాల మల్లయ్య అనారోగ్యంతో హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకొన్న జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు శనివారం హాస్పిటల్ వెళ్లి వారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఆయన వెంటన రాష్ట్ర యువజన కార్యదర్శి శివరాత్రి పృథ్వీ, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు బండి రంజిత్ తదితరులు ఉన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయాలి

ప్రజాశక్తి-వత్సవాయి : రైతులు విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయటానికి ముందుకు రావాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం రవి కిషోర్ తెలిపారు. డాక్టర్ కెఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వ ర్యంలో కృషి అనుభవ కార్యక్రమం మక్కపేట గ్రామంలో శనివారం జరిగింది. స్థానిక ఎన్‌కెఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.రవి కిషోర్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఆర్.ప్రభావతి, గ్రామ సర్పంచ్ మల్లెల శివప్రసాద్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఎక్స సర్పంచ్ కోటయ్య, కె.వై.ఎన్ శర్మ పాల్గొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. ప్రభావతి పెరటి తోటల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం ద్వారా వచ్చే వ్యాపార లాభాలను రైతులకు వివరించారు. విద్యార్థులు చేసిన కళారూపాలు, విలువ ఆధారిత ఉత్పత్తులను పరిశీలించారు.

రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ ముట్టడి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మాదిగలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న రెడ్డిగూడెం ఎస్ఐ మోహనరావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పిఎస్ నాయకులు చేపట్టిన రెడ్డిగూడెం పోలీసు స్టేషన్ ముట్టడి విజయవంతమైంది. ఎస్ఐ మోహనరావు మాదిగలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, దాడులకు పాల్పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెడ్డిగూడెం ఎస్‌సి వాడ నుంచి పోలీస్ స్టేషన్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. ఎస్ఐపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు మందా వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కోట దానియేలు, ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జీ ఆదిమూలపు ప్రకాష్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మంద పిచ్చియ్య, తదితరులు పాల్గొన్నారు. రెడ్డిగూడెం ఎస్ఐ బి మోహనరావుకు మైలవరం సిఐ చంద్రశేఖర్ మెమో జారీ చేశారు. ఎంఆర్పీఎస్ చేపట్టిన ఉద్యమం, దాని నేపథ్యం మేరకు ఈ మెమో జారీ చేసినట్లు సిఐ తెలిపారు.

మండలి వెంకట కృష్ణారావుకు నివాళి

మండలి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గాంధీ పిలుపుమేరకు విద్యార్థి దశలోనే పోరాడిన మహనీయుడు మండలి వెంకటకృష్ణారావు అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. శనివారం అవనిగడ్డ వంచన సెంటర్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు 28వ వర్ధంతిని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అవనిగడ్డ హై స్కూల్ పై జాతీయ జెండా ఎగురవేశారని అన్నారు. చిన్ననాడే సేవా నైతికలిగిన కష్ణారావు ఆనాడు తన తోటి విద్యార్థులు కిరోసిన్ దీపాల కింద చదువుకునేందుకు కిరోసిన్ కొరత ఏర్పడితే కిరోసిన్ సేకరించి పేద విద్యార్థులకు అందించే వారిని తెలిపారు. యుక్త వయసులోనే 1957లో మచిలీపట్నం నుంచి పార్లమెంట్ సభ్యునిగా గెలిచి అవనిగడ్డకు విద్యుత్ సౌకర్యం తెచ్చారన్నారు. అన్ని గ్రామాల్లో సబ్స్టేషన్లో నిర్మించాలని 1958 లోనే అవనిగడ్డకు టెలిఫోన్ సౌకర్యం తేవడంతో పాటు దివిసీమ గ్రామాలకు టెలిఫోన్ ఎక్స్చేంజిలో నిర్మించారని తెలిపారు. అదేవిధంగా అవనిగడ్డలో జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి దివిసీమలో విద్యావ్యాప్తికి కషిచేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా 1976-79 మధ్య అవనిగడ్డ జూనియర్ కళాశాలలో టీచర్ ట్రైనింగ్ కోర్స్ ప్రవేశపెట్టి 550 మందిని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా ఎస్వీఎల్ క్రాంతి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కష్ణారావు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ వి ఎల్ క్రాంతి విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం సుబ్బారావు, జనసేన ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, ఎఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, బీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి శ్రీనివాసరావు పాల్గొన్నారు

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : నందమూరి తారక రామారావు మెమోరియల్ రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ మెన్ బాస్కెట్ బాల్ పోటీలను స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో శనివారం స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేది నుండి 29వ తేది వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. 15 జిల్లాల నుండి బాస్కెట్ బాల్ టీమ్‌లు పాల్గొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, టిడిపి నాయకులు సిహెచ్ జగన్‌మోహనరావు, కమిటి సభ్యులు అట్లూరి భవానిప్రసాద్, బొగ్గవరపు తిరపతయ్య, జి.వి వరప్రసాద్ పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న కలెక్టర్

ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డిఎస్‌సి కోచింగ్ హాజరై ఉద్యగాలు సాధించిన అభ్యర్థులను జిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఘనంగా సత్కరించి అభినందించారు. మెగా డి ఎస్ సి -2025 127 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఆన్లైన్ ఆఫ్ లైన్, ఆన్లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వగా, వారిలో 13 మంది ఉద్యోగాలు సాధించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, అధికారి జి.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి యస్. హనుమ,జిల్లా కార్యాలయ సిబ్బంది, వసతి గృహ సంక్షేమాధికారులు ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామంలో రాష్ట్రయ పోషణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలకు బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎల్ సులోచనరాణి, డాక్టర్ వజ్రకుమార్, డాక్టర్ హారిక, అంగన్వాడీ కార్యకర్తలు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'కవన కుసుమాలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : ఎక్కడ పుస్తకం ముద్రించబడిన అది నా పుస్తకమే అని సాహిత్య అభిమానులు భావించాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం బచ్చుపేట మహతి లలిత కళావేదికలో నెలనెలా వెన్నెల్లో భాగంగా ప్రముఖ కవి మేడిశెట్టి యోగేశ్వరరావు రచించిన 'కవన కుసుమాలు' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. న్యాయవాది మచిలీపట్నం సాహితీ మిత్రులు అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షత వహించగా కవన కుసుమాలు పుస్తకం ప్రముఖ వైద్యులు సంస్కతాంధ్ర పండితులు బందావనం ధన్వంతరి ఆచార్య ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి మంగళవారం మహతిలో జరిగే సత్సంగం మేడిశెట్టి యోగేశ్వరరావు కవితతోనే ప్రారంభమవుతుందన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టీ పెద్దిరాజు, తెలుగు భాషా సాంస్కతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి అప్పినేడి పోతురాజు వైఎన్వి సురేష్ బాబు, శివాజీ గణేశ్వరరావు, కాట్రం రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ సనక వెంకటస్వామి నాయుడు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ వెంకటస్వామి నాయుడు ఉద్యోగ విరమణ అభినందన సభ కార్యక్రమం నిర్వహించార.ు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల విశ్రాంతి ప్రిన్సిపాల్ యు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటస్వామి నాయుడు దంపతులను అధ్యాపకులు కళాశాల సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు. కళాశాల అభివద్ధి కమిటీ సభ్యులు మతి శ్రీనివాసరావు, గుడి సేవ విష్ణు ప్రసాద్, ఎన్జీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండ్రెడ్డి రాజేంద్రకుమార్, పాల్గొన్నారు.

కొనసాగుతున్న దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రులు మహెూత్సవాల లో భాగంగా శనివారం శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో కొండలమ్మ అమ్మవారి యాత్రికులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారిక ప్రత్యేక పూజలు నిర్వహించారు శ్రీ అమ్మవారి ఉత్స వాలకు విచ్చేసిన యాత్రికులకు దేవస్థానం కార్యనిర్వ హణా ధికారి ఆకుల కొండలరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు లు తగు ఏర్పాట్లు చేశారు. అనంతరం కుంకుమ పూజ మరియు హెూమము, భజన కార్యక్రమాలు, రాత్రి సత్య హరిచంద్ర పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ మండలం పెదపూడి (బందరు రోడ్డు) ఆంధ్ర బ్యాంక్ సమీపంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దసరానవరాత్రి మహెూత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం అమ్మవారికి లక్ష కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించిన కనకదుర్గమ్మకు పాతికమందికిపైగా సువాసినులు పాల్గొని నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం అశేష మహిళలు, భక్తుల నడుమకొనసాగింది. **ప్రజాశక్తి - గుడివాడ** : విజయదశమిని పురస్కరించు కుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు 6వ రోజు శనివారం అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడు తున్నాయి. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో ఉన్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవాలల్లో భాగంగా శనివారం అమ్మవారు శ్రీకాత్యాయనిదేవి అవతారంలో దర్శిన మిచ్చారు. ఉత్సవ కమిటి చైర్మన్ పట్టపు చిన్న, కమిటి సభ్యులు, కార్యనిర్వహణాధికారి గోపాలరావుల నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే స్థానిక గౌరీశంకరపురంలో ఉన్నశ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్స వములలో భాగంగా లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. దేవస్థానం కమిటి చైర్మన్ నెరుసు బోసు, ఈవో కందుల వేణుగోపాలరావు, పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్** : స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహెూత్సవాల సందర్భంగా ఆరవ రోజు శనివారం శ్రీ పార్వతి దేవి, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లు దివ్య అలంకారాలతో దర్శనమిచ్చారు. శ్రీ పార్వతీ దేవిని లలితా త్రిపుర సుందరి దేవిగా, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవిని సంతానలక్ష్మీ దేవిగా అలంకరించారు. ఉదయం జరిగిన నవదుర్గ పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు మామిడి మురళీకష్ణ, కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, ఉపాధ్యక్షుడు సామా వెంకట లక్ష్మి కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవ రావు, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గుడ్లవల్లేరు మండలం కొండలమ్మ దేవస్థానంలో...

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వారి సేవలను కొనియాడారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని బందరు డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీల పారిశుధ్య కార్మికులకు శానిటరీ కిట్లు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పర్యావరణాన్ని పరిరక్షించటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఘనమైనదని కొనియాడారు. అలాంటి వారి సంక్షేమాన్ని కాపాడవలసిన బాధ్యత ఉందని, వారికి శానిటరీ కిట్లు పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య భద్రత కల్పించామన్నారు. వ్యర్థాలను తొలగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోయ నాగమణి, జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జే అరుణ, ఇతర అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌కు ఆణిముత్యం ఎంపిక

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన ఆణి ముత్యం డీఎస్సీలో కృష్ణా జిల్లా స్థాయిలోనే నాలుగో ర్యాంకు సాధించి పలువురు ప్రశంసలు పొందింది. కూచిపూడికి చెందిన వినుకొండ శివరామకష్ణ(మైక్) మొదటి కుమార్తె వినుకొండ కనకదుర్గ స్కూల్ అసిస్టెంట్ (లెక్కలు) డిఎస్సీ లో సాధించిన నాలుగో ర్యాంకుతో ఆ కుటుంబం తమ ఆనందాన్ని పలువురితో పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని వివాహమై ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత ఆమె ప్రగతి (పామర్రు) విద్యాసంస్థలో శిక్షణ పొంది పామర్రు నియోజకవర్గ శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా ద్వారా అపాయింట్మెంట్ లెటర్ పొందింది. శివరామకృష్ణ ముగ్గురు ఆడపిల్లలు ఉన్నత విద్యావంతులే. గతంలో గంపలగూడెంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో కాంట్రాక్ట్ పోస్ట్‌లో టీచరుగా పనిచేసి సంతప్తి చెందగా డీఎస్సీ కోచింగ్ కి ప్రిపేర్ అయి 82 మార్కులకు పైగా పొంది తన లక్ష్యాన్ని సాధించింది.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైద్య ఆరోగ్యశాఖ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అవనిగడ్డలోని రెవెన్యూ సమావేశ మందిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అనేక స్వచ్ఛంద సంస్థలతోపాటు వైద్య ఆరోగ్య శాఖ వారు కూడా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రావు అధ్యక్షత వహించగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేకనూరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ శాఖ వారు సంయుక్తంగా నిర్వహించగా ఈ రక్తదాన శిబిరాన్ని డాక్టర్ మహేష్ పర్యవేక్షించగా 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

రోడ్డు బాగు చేయాలని వినతి

ప్రజాశక్తి-చల్లపల్లి : బురదను తొలగించి వెంటనే తారు వేయాలని బీఎస్పీ కార్యకర్త చందోలు జైపాల్ ఆర్ అండ్ బి అధికారులను డిమాండ్ చేశారు. శనివారం చల్లపల్లిలోని పాత్రికేయులతో మాట్లాడుతూ శ్రీకాకుళం, నడకుదురు ఆర్ అండ్ బి రహదారిని వెలివోలు గ్రామపంచాయతీ పరిధిలో కొంతమంది వ్యక్తులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రోడ్డు తవ్వి తూములు వేశారన్నారు. తూములపై బంక మట్టి వేయడం వలన వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పై ఆర్టీసీ స్కూలు బస్సు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు నిత్యం రాకపోకలు జరుగుతాయన్నారు. తారురోడ్డు వేయాలని వినతిపత్రంలో కోరారు.

గాంధీ జయంతి ఉత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ

బెజవాడ బార్ అసోసియేషన్ కోర్టు ప్రాంగణంలో శనివారం గాంధీ జయంతి ఉత్సవన్ను ప్రారంభించారు. సబర్మతి ఆశ్రమం ఏర్పాటు చేసి గాంధీ ఫొటోలను ఎగ్జిబిషన్ను ఏర్పాటు చేశారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా ది బెజవాడ బార్ అసోసియేషన్లో శనివారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు గాంధీ జయంతి ఉత్సవ్ పేరుతో ఒక ఉత్సవాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాదులు జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ నైనాల జయసూర్య, కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గుట్టల గోపి, రెండవ అదనపు జిల్లా జడ్జి సత్యానందతో పాటు 31 మంది జడ్జిలు పాల్గొని సబర్మతి ఆశ్రమాన్ని, ఫోటో గ్యాలరీని ప్రారంభించారు. అనంతరం మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీబీఏ ప్రెసిడెంట్ ఏకే భాషా అధ్యక్షత వహించి జడ్జిలకు మహాత్మా గాంధీ జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతిగా ఇచ్చారు.

ముగిసిన అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-మైలవరం : గత రెండు రోజులుగా స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇళ్లా.రవి మాట్లాడుతూ క్రీడలు శారీరిక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. విజయ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రథమ స్థానాన్ని, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయవాడ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈ టోర్నమెంట్ నుండి సౌత్ ఇండియా దక్షిణ భారత పురుషుల అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక చేయటం జరిగిందని టోర్నమెంట్ ఆర్గనైజర్ మేజర్ మన్నే స్వామి తెలిపారు.

ముంపు సమస్యపై సర్వే..!

మచిలీపట్నం నగర పాలక సంస్థలో వేసవిలోనే డ్రైయిన్లు పొంగి నీరు రోడ్లపై ప్రవహించడం సర్వసాధారణం. చిన్నపాటి వర్షాలకే పలు కాలనీల్లో ముంపు సమస్య తలెత్తుతోంది. ఈ సమస్య పరిష్కారానికి గతంలో రూపొందించిన ప్రణాళికలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ తాజాగా సర్వే నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సంక్లిష్టమైన ముంపు సమస్య పరిష్కారానికి ఈ సర్వే ఎంత వరకు మార్గం చూపుతుంది. ప్రభుత్వాలు అవసరమైన నిధులు కేటాయిస్తాయా? అనేది చర్చనీయాంశమైంది. సముద్ర తీరానికి సమీపంలోని మచిలీపట్నం పరిసర ప్రాంతంలో అధిక వర్షాలు కురుస్తాయి. తరచూ తుఫానుల తాకిడికి గురవుతూ ఉంటుంది. సముద్ర మట్టానికి సమాంతరంగా ఉండడంతో ఈ వర్షపు నీరు ఒక్కపట్టాన కదలదు. వర్షాకాలంలో ఏ రోడ్డు చూసినా నీరు నిలిచి ఉంటుంది. లోతట్టు ప్రాంతాలైనా డ్రైవర్స్‌కాలనీ, ఆర్‌టిసి కాలనీ, గోపాల్‌నగర్, నారాయణపురం, యానాదుల కాలనీ, వైఎస్ఆర్‌కాలనీ, పెయింటర్స్ కాలనీలు తరచూ ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. బస్టాండ్ సెంటర్, కోనేరు సెంటర్ సైతం జలమయం అవుతాయి. వర్షం కురిసి ఆగిన 20 నుంచి 40 నిమిషాల తర్వాతగానీ రోడ్డుపై వాహనాలు తిరగలేని పరిస్థితి. పాదచారులకు అవస్తలు తప్పవు. ఎగువ

వీక్షణం

నుంచి వచ్చే నీటి ప్రవాహం తగ్గిన తర్వాత గానీ నగరంలోని అంతర్గత డ్రైయిన్లలో నీరు కదులుతుంది. సముద్రపు పోటు ఎక్కువగా ఉన్న రోజుల్లో వేసవిలో సైతం డ్రైయిన్లలో నీరు కదలక రోడ్లపై ప్రవహిస్తుంటుంది. 2008లో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ స్కీం (యుఐడిఎస్ఎస్ఎంటి) ద్వారా మచిలీపట్నంలో డ్రైయిన్ల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. వర్షపు నీటిని వేగవంతంగా సముద్రంలోకి తరలించేందుకు అనుగుణంగా కొన్ని ప్రాంతాల్లో డ్రైయిన్లను వెడల్పు చేసి (స్టోం వాటర్ డ్రైయిన్‌లు) నిర్మించారు. దీని కొనసాగింపులో భాగంగా 2011లో అమృత ఫేజ్-2 రూ.21.51 కోట్లు కేటాయించారు. 2018 సెప్టెంబర్‌లో ఎనీ ఫండింగ్ గ్రాంటు నుంచి మరో రూ.86 కోట్లు మేజర్ డ్రైయిన్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. సముద్ర మట్టానికి సమాంతరంగా ఉన్న పట్టణంలో డ్రైయిన్లు నిర్మించిన నీరు కదిలే పరిస్థితి లేదు. ముంపు సమస్య అధిగమించేందుకు డ్రైయిన్లలో నీరు ఎత్తి పోసేందుకు నాలుగు పంప్ హౌస్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. భారీ వర్షాలకు ఎగువ నుంచి వచ్చే నీటిని డ్రైయిన్ల నుంచి నగరంలోకి చొచ్చుకు రాకుండా గేట్లు ఏర్పాటు చేసి, నగరంలోని నీటిని ప్రధాన డ్రైయిన్లలోకి తోడేందుకు వీలుగా ఈ పంప్‌హౌస్‌లను ఏర్పాటు చేయాలి. డ్రైయిన్ల పనులు, పంపు హౌస్‌ల నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. తాజా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సంస్థ సర్వే ప్రణాళికలకు అనుగుణంగా ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

డిఎస్ఆర్‌వి ప్రసాద్

విద్యార్థుల్లో సృజనాత్మక పెంపునకు కృషి

- **శారద కాలేజీ విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ**

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొం దించేందుకు అనేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని శారద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని శారద జూనియర్ కళాశాలలో 'డిజి ఉత్సవ్స కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యాప్ డెవలప్‌మెట్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రపంచ మంతా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వైపు చూస్తోందని, ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ఫండమెంటల్స్ ముందే చెప్పాలనే ఉద్దేశంతో ఈ కోర్స్ కూడా పెట్టడం జరిగిందన్నారు. శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులను గుర్తించి వారితో ప్రాజెక్ట్ వర్క్ కూడా చేయిస్తామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేష్ బాబు మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాన్నిపెంపొందించేందుకు వారం రోజులు రోబోటిక్ తరగతులు నిర్వహించామని తెలిపారు. ఎడినో రోబోట్స్ వ్యవస్థాపకులు బాజీ బాషా మాట్లాడుతూ గతంలో బిటెక్, స్కూల్ లెవెల్‌లోనే రోబోటిక్స్ ఉండేదని, ఇప్పుడు శారద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కూడా నేర్పిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.